సాక్షి
నంద్యాల
సోమవారం । 20 । మే । 2024




శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్ల దర్శనం కోసం బారులుదీరారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అద్భుతం.. ఆశ్చర్యం!

బోయవాండ్లపల్లి సమీపంలో సహజసిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ గుహలను రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లతో అభివృద్ధి చేసింది. 8లో▸

న్యూస్‌రీల్

ఆలయాల్లో అభివృద్ధి పనుల తనిఖీ



దేవదాయశాఖ ప్రధాన కార్యాలయం అధికారులను సత్కరించిన ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో రూ. 200కోట్లతో ప్రధాన ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల తనిఖీ చేసేందుకు రాష్ట్ర దేవదాయశాఖ ప్రధాన కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం పర్యటిస్తుందని దేవదాయశాఖ హెడ్ ఆఫీస్ టెక్నికల్ ఆఫీసర్ భవిరి రవి తెలిపారు. జిల్లా దేవదాయశాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈ సతీష్, ఈఈ గంగయ్య, డీఈ శ్రీనివాసప్రసాద్, ప్రధాన కార్యాలయం సీజీఎఫ్ విభాగం ఏసీ జ్యోతి, శిల్పి పనుల విభాగం ఏఈ ఉమా చౌదరిలు ఆదివారం మహానందికి వచ్చారు. వీరికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారు మాట్లాడుతూ శ్రీశైలంలో సుమారు రూ. 80 కోట్లు, మహానందిలో రూ. 15 కోట్లు, శ్రీకాళహస్తిలో రూ. 40 కోట్లతో పాటు ఇతర ఆలయాల్లో పనులు చేస్తున్నారన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాల్లో వసతిగృహాలు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. అనంతరం వారు అహోబిలం, యాగంటి ఆలయాల తనిఖీకి వెళ్లారు. వారి వెంట ఏఈఓ వై.మధు, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనుంది. జిల్లాలో మొత్తం 13,748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఫస్ట్ ఇయర్ జనరల్ 8,813, సెకండ్ ఇయర్ జనరల్ 3,933, ఒకేషనల్ ఫస్ట్ ఇయర్ 537, సెకండ్ ఇయర్ 465 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కళాశాలలో పరీక్షలు తప్పిన అత్యున్నత మార్కులను పొందేందుకు బెటర్‌మెంట్ కట్టిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లను నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వీటి ద్వారా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు.

ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు తాత్కాల్ కింద రూ.3 వేల జరిమానాతో ఫీజు చెల్లించేందుకు నేటి(సోమవారం)తో గడువు ముగియనున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీ సెట్

కర్నూలు సిటీ: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని 11 కేంద్రాల్లో జరిగిన ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు కర్నూలు జిల్లా నుంచి 1,316 మందికిగాను 1,232 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లా నుంచి 613 మందికిగాను 586 మంది హాజరయ్యారు.

సీట్లు పొందిన వారు నేటిలోపు చేరాలి

కర్నూలు సిటీ: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు పొందిన పేద విద్యార్థులు నేటి(సోమవారం)లోపు స్కూళ్లలో అడ్మిషన్ పొందాలి. లేదంటే వారి స్థానంలో మొదటి విడతలో సీట్లు రాని వారికి కేటాయించనున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఉచిత విద్య కింద జిల్లాలో 2,554 మంది విద్యార్థులు 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,992 మంది విద్యార్థులకు స్కూళ్లను కేటాయించారు.

బావుల్లో వాటర్ లెవల్స్ నమోదుకు జలదూత్ యాప్

కర్నూలు(అగ్రికల్చర్): నైరుతి రుతుపవనాలు రావడానికి ముందు, రుతుపవనాలు వెళ్లిపోయిన తర్వాత రెండుదఫాలుగా బావుల్లో వాటర్ లెవల్స్ తీసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జలదూత్ యాప్‌లో వాటర్‌లెవల్స్‌ను నమోదు చేయాల్సి ఉంది. వాటర్‌లెవల్స్ తీసే ప్రక్రియను జిల్లా నీటియాజమాన్య సంస్థ చేపడుతోంది. వీటి ఆధారంగా భూగర్భ జలాలు ఏ స్థాయిలో ఉన్నాయనే దానిపై స్పష్టత వస్తుంది. దీనిని బట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలసంరక్షణకు తగిన చర్యలు చేపడుతాయి.

భద్రత స్ట్రాంగ్

- ఈవీఎంలకు పటిష్ట బందోబస్తు
- స్ట్రాంగ్ రూములకు మూడంచెల భద్రత, పరిసరాల్లో 144 సెక్షన్
- కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిఘా
- జూన్ 4న ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు
- కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- గుర్తింపు ఉన్న ఏజెంట్లకు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి



కమాండ్ కంట్రోల్ రూముల నుంచి స్ట్రాంగ్ రూములను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ప్రజా తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం త్వరలో తేలిపోనుంది. జిల్లాలో ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు చెందిన ఈవీఎంలను పట్టణంలోని ఆర్‌జీఎం, శాంతిరాం ఫార్మసీ, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూములలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూములలోని ఈవీఎంలకు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, మూడవ అంచెలో స్థానిక పోలీసులతో 24 గంటల పాటు బందోబస్తు ఉండేలా ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చారు. భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను భద్రపరచిన పరిసర ప్రాంతాలైన ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల వద్ద కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎవరైనా హింసాత్మక ఘటనకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటారు. 144 సెక్షన్ అమలులో ఉన్న ప్రాంతాల వద్ద నలుగురు, అంతకు మించి గుంపు గుంపులుగా ఉండకూడదు. ఓటింగ్ యంత్రాలు భద్రపరిచేందుకు ప్రత్యేక సదుపాయాలు ఉన్న గదిని ఎంచుకుని డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సాధారణంగా స్ట్రాంగ్ రూంలకు ప్రవేశ ద్వారం ఒక్కటే ఉంటుంది. ఇతర మార్గాల ద్వారా చేరుకోవడానికి స్ట్రాంగ్ రూంల వద్దకు ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.



స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన ఈవీఎంలు

ఈవీఎంలలోనే తీర్పు...

జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత మూడు నెలలుగా ఎన్నికల్లో గెలుపు కోసం హోరా హోరీగా అభ్యర్థులు పోరాడారు. ఇప్పుడు ఫలితాల కోసం జూన్ 4వ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు గెలుపు తమదేనని ధీమాతో ఉండగా, మరికొందరిలో ఆందోళన ఉంది. పోలైన ఓట్లల్లో తమకు ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉందనే దానిపై అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. నియోజకవర్గాలు, గ్రామాల వారీగా లెక్కలు తెప్పించుకుంటున్నారు. పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారితో సమావేశమై పరిస్థితులు ఆరా తీస్తున్నారు. ఓటర్ల మూడ్ ఎలా ఉంది. ఎటు వైపు మొగ్గు చూపారు. తదితర అంశాలను రాబట్టేపనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిఘా..

ఈవీఎంల భద్రతకు అమర్చిన సీసీ కెమెరాలు అందించే దృశ్యాలను కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల నిర్వహణకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం జరిగినప్పుడు జనరేటర్లను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములు తెరిచే ముందు, మూసే సమయంలో సీసీ కెమెరాల్లో సీల్ కనిపించే విధంగా ఏర్పాట్లు చేశారు. సీసీ ఫుటేజీలు అన్ని కమాండ్ కంట్రోల్ రూముకు కనెక్ట్ చేయబడి 24 గంటలు సిబ్బంది పర్యవేక్షిస్తూ ఉండేలా ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూముల సమీపంలోకి అనధికార వ్యక్తుల వాహనాలకు అనుమతిని నిషేధించారు.

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు..

జూన్ 4వ తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీనివాసులు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్, 760 మంది సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణను నోడల్ అధికారి ఆధ్వర్యంలో ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎం ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. ప్రవేశ మార్గం దగ్గర గుర్తింపు కలిగిన సాధారణ ఏజెంట్లు మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అవసరమైన పోలీసు సిబ్బంది నియామకంతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు కౌంటింగ్ కేంద్రాల సమీపంలోని గ్రామ ప్రజలు బయట ప్రాంత వాసులకు ఆశ్రయం కల్పించకుండా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ రోజు ఉదయం మాత్రమే స్ట్రాంగ్ రూములను తెరిచి ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల గదులకు వరుస క్రమంలో తరలిస్తారు. అప్పటి వరకు స్ట్రాంగ్ రూములోనే ఈవీఎంలు ఉంటాయి. లెక్కింపు రోజు ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు రిటర్నింగ్ అధికారి, పరిశీలకుడి సమక్షంలో వీడియో చిత్రీకరణ మధ్య ఈవీఎంలను తెరుస్తారు.

బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిలు అన్నారు. ఈవీఎం బాక్స్‌లను భద్రపరచిన ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలను వారు తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన భద్రతా పరిస్థితులను ఆరా తీశారు. తలుపులకు వేసిన తాళాలు, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని స్ట్రాంగ్ రూంలు సీసీ కెమెరాలతో కనెక్ట్ చేయబడి వెబ్ కాస్ట్ అవుతున్న దృశ్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో వారు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రవేశించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఆర్జీఎం, శాంతిరాం, ఫార్మసీ కళాశాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'మోడల్'లో ప్రవేశాలకు ఆహ్వానం

- జిల్లాలో 19 మోడల్ స్కూళ్లలో 3,040 ఇంటర్ సీట్లు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 22న చివరి తేదీ

గోస్పాడు: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఇప్పటికే ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యింది. ఎంపిక జాబితా విడుదల కావాల్సి ఉంది. అలాగే ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల కాగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 22 చివరి తేదీగా నిర్ణయించారు. దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏ పీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయి. మోడల్ స్కూల్లో ఇంటర్ ఫస్టియర్‌కు ఒక్కో స్కూల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులుఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఒక్కో స్కూల్లో ఇంటర్ ఫస్టియర్‌కు 160 సీట్లను భర్తీ చేస్తారు. జిల్లాలో 20 మోడల్ స్కూల్స్ ఉండగా వారిలో నంద్యాల మినహా మిగిలిన వాటిలో ఇంటర్ వరకు విద్యను అందిస్తున్నారు. ఒక్కొక్క మోడల్ స్కూల్లో అన్ని గ్రూపులకు కలిసి 160 సీట్లు చొప్పున ఉండగా జిల్లా వ్యాప్తంగా 3,040 సీట్లు భర్తీ చేయనున్నారు. ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తుల నుంచి మెరిట్ జాబితాను తయారు చేసి ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు. అనంతరం పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఎంపికలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. ఎస్సీ లకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు 29, ఓసీలకు 40, ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తారు.



మోడల్ స్కూల్





స్వామి, అమ్మవార్లను కల్యాణ మంటపానికి తోడ్కొని వస్తున్న అర్చకులు, మాంగల్యధారణ గావిస్తున్న దృశ్యం

కల్యాణం.. కమనీయం

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలంలో ఆదివారం శ్రీ లక్ష్మీ నరసింహుడు, చెంచులక్ష్మీల పరిణయ వేడుక వైభవంగా జరిగింది. లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం మూలమూర్తులను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాలా నరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించి అనంతరం పట్టు పీతాంబారలతో అలంకరించి కొలువుంచారు. శ్రీ సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న అర్చకులు



వజ్రాన్వేషణ

అదృష్టం వజ్రమైతే కష్టాలు తీరిపోవడమే కాకుండా క్షణాల్లో లక్షాధికారి కావొచ్చు. చేయాల్సిందల్లా నేలకేసి తీక్షణంగా చూస్తూ వెళ్లాలి అంతే! మెరుగురాయి కంట పడితే చేతిలో తీసుకొని పరీక్షగా చూడాలి. మన అదృష్టం బాగుంటే మెరుగరాయే వజ్రం కావచ్చు. తొలకరి వర్షాలకు కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి, బొల్లవానిపల్లి, ఉప్పర్లపల్లి, పి. కొత్తూరు, చెన్నంపల్లి, జి.ఎర్రగుడి, తుగ్గలి, గిరిగెట్ల, రామాపురం, చిన్నజొన్నగిరి, గిరిజన తండాల్లో వజ్రాన్వేషణ మొదలవుతుంది. కురుస్తున్న వర్షాలకు జనం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉదయాన్నే పొలాల్లో వాలిపోతున్నారు. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి జనం వచ్చి ఇక్కడ వజ్రాన్వేషణ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎర్ర నేలల్లో తిరుగుతూ వజ్రాల కోసం వెతుకుతున్నారు. ఈనెల 8వతేదీన చెన్నంపల్లిలో పొలం పనులకు వెళ్లిన ఓ మహిళకు రూ.3.96 లక్షల విలువ చేసే వజ్రం లభ్యమైనట్లు సమాచారం. కాగా.. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుక్కి దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. వజ్రాన్వేషకుల తాకిడితో పొలాలు గట్టి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – తుగ్గలి



జొన్నగిరి సమీపంలోని పొలంలో వజ్రాల కోసం వెతుకుతున్న ప్రజలు

ఉజ్వల భవిత.. ఉపాధి తోవ



నూతనంగా నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనం

- ప్యాపిలి మండలం హుసేనాపురంలో పశువైద్యకళాశాల ఏర్పాటు
- వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగావకాశాలు మెరుగు
- రెండేళ్లలో కోర్సు పూర్తి చేసిన 22 మందికి సచివాలయ ఉద్యోగాలు



శిక్షణలో భాగంగా చికిత్స నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్యాపిలి: ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. హుసేనాపురం (కొమ్మేమర్రి) గ్రామంలో ఏర్పాటు చేసిన ఎనిమల్ హజ్బెండరి పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగావకాశాలకు నిలయంగా మారింది. 2021 ఫిబ్రవరిలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. హుసేనాపురం రూ.11.11కోట్లతో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనం, బాల బాలికలకు వేర్వేరు వసతి గృహాలను ప్రభుత్వం నిర్మించింది. ప్రస్తుతానికి హుసేనాపురం ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభించే బ్యాచ్‌తో కొత్త భవనాల్లోకి కళాశాలను తరలిస్తారు. సువిశాలమైన కళాశాల భవనం, వసతి గృహాలతో విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. రెండేళ్ల పాటు కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు భవిష్యత్తులో సునాయసంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఉంది. గత రెండు సంవత్సరాల్లో ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులందరూ సచివాలయాలు, ఆర్బీకేల్లో వెటర్నరీ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించారు. ఏటా 35 మంది విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్ పొందవచ్చు. ప్రథమ సంవత్సరంలో 35 మంది, ద్వితీయ సంవత్సరంలో 35 మంది చొప్పున విద్యార్థులు ఉంటారు. వీరికి నాలుగు సెమిస్టర్లలో పౌల్ట్రీ, అనాటమి, ఫిజియాలజీ మీట్, లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్, జూ అనిమల్స్, డెయిరీ అనిమల్స్ మేనేజ్‌మెంట్ వంటి 18 రకాల కోర్సులు అందుబాటులో ఉంటాయి. సెమిస్టర్‌కు ఆరు కోర్సులు చొప్పున ఉంటాయి. మూడు సెమిస్టర్లు కళాశాలలో కాగా నాలుగో సెమిస్టర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం ఉంటుంది. ఇది వంద రోజుల పాటు సమీపంలోని వెటర్నరీ, ప్రయోగశాలల్లో, ఆసుపత్రుల్లో క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. అనంతరం వైవాలో వైవా బృందం విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నుంచి సంతృప్తికర సమాధానాలను రాబట్టుకుంటుంది. సమాధానాలను పరిశీలించిన వైవా బృందం సంబంధిత నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుంది.

దరఖాస్తులు ఇలా..

ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మే నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను భర్తీ చేస్తారు. రోస్టర్ విధానంలో సీట్ల భర్తీ ఉంటుంది. గత ఏడాది ఇంటర్‌మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. ఈ కోర్సు పూర్తయిన తర్వాత నేరుగా డిగ్రీ విద్యను కొనసాగించవచ్చు. గత రెండు సంవత్సరాల్లో ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల్లో 22 మంది విద్యార్థులు సచివాలయం, ఆర్బీకేల్లో వెటర్నరి అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించారు.

సువర్ణావకాశం



పదో తరగతి ఉత్తీర్ణులైన పేద విద్యార్థులు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో అందిస్తున్న కోర్సులు సువర్ణావకాశం అనే చెప్పాలి. రాష్ట్రంలో అతి కొద్దిగా ఉన్న ఈ కళాశాలలు ప్యాపిలి మండలంలో ఏర్పాటు కావడంతో స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు. తక్కువ సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఇదొక వరం. – మాధవి, ప్రిన్సిపాల్, వెటర్నరి పాలిటెక్నిక్ కళాశాల



బాలుర వసతి గృహం

క్లుప్తంగా

కొత్తూరుకు భక్తుల తాకిడి



స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు తెల్లవారు జామునే అలయానికి చేరుకుని స్వామివారికి ఇష్టమైన సలిపిపిండిని నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం ఒక్క రోజే స్వామి వారికి 340 మంది అభిషేకాలు చేశారని ఈఓ రామక్రిష్ణ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు.

కురువ విద్యార్థులకు 26న ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(అర్బన్): 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ఈ నెల 26వ తేదిన (ఆదివారం) ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు జిల్లా, నగర కురువ సంఘం నేతలు తెలిపారు. స్థానిక పెద్దపాడు రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్ పక్కనున్న బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘానికి సంబంధించిన మండల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు, కురువ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నకిలీ బంగారంతో రుణాలు!

మద్దికెర: పెరవలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నకిలీ బంగారంతో గతేడాది రుణాలు తీసుకున్నారు. ఇందుకు షూరిటీగా రైతుల పాస్‌బుక్‌లు తనఖా పెట్టారు. సంబంధిత రైతులకు రుణాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో బండారం బయట పడింది. దీంతో రైతులు లబోదిబోమంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై సంబంధిత బ్యాంకు మేనేజర్ హరీష్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. రూ. 14 లక్షల వరకు రుణాలు తీసుకున్నారని, విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చెట్టు కూలి బాలుడి మృతి

హాలహర్వి: గాలివాన బీభత్సంతో చెట్టు కూలి ఓ బాలుడు మృతి చెందగా.. మరో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి విరుపాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శాంతమ్మ, బసవరాజు దంపతుల కుమారుడు సంతోష్ (09)తో పాటు మరో బాలుడు రాత్రి 8 గంటల సమయంలో ఇంటి సమీపంలోని మర్రిచెట్టు కింద ఆడుకుంటున్నారు. ఉన్నట్టుండి వర్షం కురవడంతోపాటు భారీగా గాలి వీయడంతో మర్రిచెట్టు కూలి పడిపోవడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో బాలుడిని చికిత్స కోసం ఆలూరు ఆస్పత్రికి తరలించారు.



ఆవు పొదుగులా కనిపించే శిలాజం



ఆకట్టుకునే శిలాకృతులు



రుద్రాక్షల రూపంలో..

అద్భుతం.. ఆశ్చర్యం!

- బోయవాండ్లపల్లి సమీపంలో సహజసిద్ధంగా ఏర్పడిన వాల్మీకి గుహలు
- వాల్మీకి మహర్షి తపస్సు చేసిన గుహలుగా ప్రతీతి
- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న సందర్శకులు



శివలింగం



సహజసిద్ధంగా ఏర్పడిన నంది



వాల్మీకి గుహల ముఖద్వారం



గుహలోపల సుందర దృశ్యం

ప్యాపిలి: చేయి తిరిగిన శిల్పులు చెక్కినట్లు అద్భుత శిల్పాలు.. మయసభలోకి ప్రవేశాన్ని తలపించే సహజ సిద్ధ స్వాగత తోరణాలు.. నిత్యం శివలింగాన్ని అభిషేకించే నీటి ధార.. కళ్లు మిరుమిట్లుగొల్పే విద్యుత్ దీపాల వెలుగులు... చూడాలంటే బోయవాండ్లపల్లి సమీపంలో సహజసిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలకు వెళ్లాల్సిందే! దాదాపు 20 సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన ఈ గుహలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లతో అభివృద్ధి చేసింది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి గుహల అందాలను వీక్షిస్తున్నారు. వాల్మీకి గుహలను ప్యాపిలి నుంచి అయితే గుడిపాడు, పీఆర్‌పల్లి, నల్లమేకల పల్లి మీదుగా చేరుకోవచ్చు. డోన్ నుంచి అయితే కొచ్చెర్వు, హుసేనాపురం, చంద్రపల్లి, పీఆర్ పల్లి, నల్లమేకల పల్లి మీదుగా, బనగానపల్లె నుంచి అయితే గార్లదిన్నె, జలదుర్గం, హుసేనాపురం మీదుగా రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. గుహల్లోకి వెళ్లేందుకు టికెట్ రూ. 50 చెల్లించాలి. గుహల వద్ద హోటల్ ఇంకా ప్రారంభం కాలేదు. పర్యాటకులు తాగునీరు, తినుబండారాలు తీసుకెళ్లాలి.

సహజసిద్ధంగా ఏర్పడిన గుహలు

వాల్మీకి గుహలు సహజసిద్ధంగా ఏర్పడి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. 2004లో వెలుగులోకి వచ్చిన ఈ గుహల్లో వాల్మీకి మహర్షి తపస్సు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో ఎంతో వ్యయప్రయాసలతో తాళ్ల సాయంతో గుహల్లోకి వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా గుహలను అభివృద్ధి చేయలేకపోయారు. స్థానిక శాసనసభ్యులు, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎంతో శ్రద్ధతో గుహలను అభివృద్ధి చేశారు.

గుహల్లోకి వెళ్లేకొద్దీ అద్భుతాలే..

గుహల్లోకి దిగేముందు పైకప్పు మీద ఉన్న ఆవుపొదుగులను పోలిన శిలాజాలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. చేయి తిరిగిన శిల్పులు కూడా చెక్కలేని ఈ అద్భుత శిల్పాలు చూస్తూ గుహల్లోకి దిగుతుంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిది. కళ్లు మిరుమిట్లుగొల్పే లైటింగ్ సిస్టం ఆకట్టుకుటుంది. కిందికి దిగిన తర్వాత విశాల మైదానంలో కాసేపు సేద తీరవచ్చు. అక్కడే మయసభలోకి ప్రవేశాన్ని తలపించే సహజసిద్ధంగా వెలసిన స్వాగత తోరణాలు, ధ్వజస్తంభాన్ని చూడవచ్చు. అక్కడి నుంచి కాస్త ముందుకు వెళ్తే గుహలకు ఇరువైపులా సహజసిద్ధంగా వెలసిన రుద్రాక్షలు కనిపిస్తాయి. అక్కడి మట్టి మెత్తని వీబూధిని తలపిస్తుంది. అక్కడే ఉన్న సెలయేరులో నీటిని తాగి గతంలో దాహం తీర్చుకునేవారు. ప్రస్తుతం ఆ నీరు కలుషితమైంది.

శివలింగానికి నిరంతర జలాభిషేకం

గుహల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన శివలింగం ఆకృతులు ఇక్కడి ప్రత్యేకత. గుహల పైభాగం నుంచి నిత్యం నీటి ధార శివలింగంపై పడుతూ అభిషేకం చేస్తుంది. ఈ దృశ్యాన్ని చూసి సందర్శకులు ఆశ్చర్యపోతున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన నంది ఆకృతిని కూడా చూడవచ్చు. వేసవి సెలవుల్లో ఈ పర్యాటక కేంద్రాన్ని తప్పకుండా దర్శించాల్సిందే.

'బలగం'తో మంచి గుర్తింపు

- సినీ నటుడు సంజయ్ కృష్ణ



ఆలయ ఆవరణలో సంజయ్ దంపతులు

మహానంది: బలగం చిత్రంతోనే తనకు మంచి గుర్తింపు లభించిందని సినీ నటుడు సంజయ్‌కృష్ణ అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆయన మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2013లో మొదటగా కాళీచరణ్ చిత్రంలో నటించానన్నారు. బాలకృష్ణ హీరోగా చేసిన అఖండ, జయసింహా, భగవంత్ కేసరి, చిరంజీవి నటించిన ఆచార్య, పవన్ కల్యాణ్ నటించిన బీమ్లానాయక్, కాటమరాయుడు చిత్రాలు మంచి పేరు తెచ్చాయన్నారు. ఇప్పటి వరకు 53 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించానన్నారు. ప్రస్తుతం నితిన్ హీరోగా ఓ చిత్రంతో పాటు ఎనిమిది నూతన చిత్రాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభతో పాటు మంచి పాత్రలు దొరికితేనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయనను గుర్తించిన అభిమానులు ఫొటోలు తీసుకుంటూ అభిమానం చాటుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కర్నూలు/కల్లూరు: జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కర్నూలు మండలం గార్గేయపురం బ్రిడ్జి దగ్గర జరిగిన ప్రమాదంలో సుమారు 30 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత పడ్డాడు. కర్నూలు నుంచి నంది కొట్కూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆదివారం రాత్రిగుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వాహనం తలపై వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ ఏపీ22 ఏఎల్ 1227 ఆధారంగా ఎవరన్నది విచారణ జరుపుతున్నారు. వర్షం పడుతుండటంతో ఆ మార్గం గుండా వెళ్లే వారు ప్రమాద సంఘటన వద్ద ఆగకుండా వెళ్లిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు.

దూపాడు దగ్గర...

ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో దూపాడు దగ్గర 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాండు(41) అనే వ్యక్తి మృతి చెందాడు. ఉలిందకొండ ఎస్‌ఐ ఎం.నరేష్ తెలిపిన వివరాలు...అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పాండు వంట మనిషిగా పని చేస్తున్నాడు. పనిమీద రోడ్డుపైకి రాగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు పాండు

ఆలూరు: మిద్దెపై నుంచి కాలు జారి పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆలూరు మండలం అరికెర గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరికెర గ్రామానికి చెందిన గోవిందప్ప, భాగ్యమ్మ దంపతులకు కుమారుడు పాండు (29) అదే గ్రామానికి చెందిన తిరుమలమ్మను ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరద్దరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే శనివారం రాత్రి భార్య, భర్తలు మిద్దెపై పడుకోవడానికి వెళ్లారు. తెల్ల వారే సరికి మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందినట్లు పాండు తండ్రి గోవిందప్ప ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాండు మృతిపై కేసు నమోదు చేసుకుని సమగ్రంగా విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ ఓబులేసు విలేకరులకు తెలిపారు.

ఇస్వీలో ప్రబలిన అతిసారం

- 45 మందికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆదోని టౌన్: మండలంలోని ఇస్వీ గ్రామంలోని అతిసార వ్యాధి ప్రబలింది. కలుషితనీరు తాగి 45 మంది అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో మహబూబియా, మాబి, ఇమామ్‌బి, చాంద్‌బాషాతో పాటు 41 మంది ఉన్నారు. అతిసార వ్యాధి ప్రబలినా ఇప్పటివరకు అధికారులు ఎవరూ గ్రామం వైపు చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి కొంత మందికి, శనివారం మరికొంతమందికి, ఆదివారం కూడా ఆస్పత్రిలో చేరుతున్నారని గ్రామస్తులు తెలిపారు.

గిరిజన గురుకులాల దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాలతో పాటు 4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ (నేడు) చివరి రోజని ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కన్వీనర్/ ప్రిన్సిపాల్ ఏ లక్ష్మిగుర్రప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు, ఆలూరులోని బాలికల పాఠశాలల్లో 3వ తరగతికి ఒక్కో పాఠశాలలో 40 సీట్లు, తుగ్గలిలోని బాలుర పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో 30 సీట్లను ఎస్టీ, ఎస్సీలకు 05, బీసీలకు 02, ఓసీలకు 01, ఏఈక్యూ (ఏజెన్సీ ఎంప్లాయిమెంట్ కోటా)కు 01, యానాది/ దివ్యాంగులకు ఒక సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. మూడు పాఠశాలల్లో మొత్తం 120 సీట్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు చెందిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేసేందుకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆలూరు బాలికల పాఠశాలలో 4వ తరగతిలో 27, 5వ తరగతిలో 05, 9వ తరగతిలో 3 సీట్లు ఉన్నాయన్నారు. కర్నూలు బాలికల పాఠశాలలో 4వ తరగతిలో 27, 5వ తరగతిలో 22, 6వ తరగతిలో 12, 7వ తరగతిలో 04, 8వ తరగతిలో 06, 9వ తరగతిలో 06 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. తుగ్గలి బాలుర పాఠశాలలో 4వ తరగతిలో 36, 5వ తరగతిలో 30, 6వ తరగతిలో 34, 7వ తరగతిలో 11, 8వ తరగతిలో 17, 9వ తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. బ్యాక్‌లాగ్ ఖాళీలకు గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదిన స్థానిక బిర్లాగేట్ సమీపంలోని గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో లాటరీ నిర్వహిస్తామన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు



సమ్మర్ క్యాంపులో తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కర్నూలు (టౌన్) : సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రతి విద్యార్థి, విద్యార్థినీ వినియోగించుకొవాలని జిల్లా క్రీడల అబివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కు అవరణలో తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును డీఎస్‌డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. సెలవులను వృథా చేయకుండా సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసల 6302555345 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.


నిజ బృందావన దర్శనం



రాఘవేంద్రుల నిజ మూల బృందావనం

మంత్రాలయం: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం భక్తులకు రాఘవేంద్రుల నిజ మూల బృందావన దర్శనం కలిగింది. ఏకాదశి పర్వదినాన శ్రీమఠంలోఎలాంటి పూజలు, ఉత్సవాలు చేపట్టకపోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రాఘవేంద్రుల మూల బృందావనానికి తులసి మాల, సన్యాస వస్త్రంతో అలంకరణ చేశారు. భక్తులకు నిజ బృందావన దర్శన భాగ్యం కల్పించారు. ఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు, పండితులు, బ్రాహ్మణులు ఉపవాస దీక్ష చేపట్టారు. సోమవారం ఉదయం 8గంటలకు ఉపవాస దీక్ష ముగియనుంది.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కోట్ల రైల్వే స్టేషన్-కృష్ణానగర్ అండర్ రైల్వే బ్రిడ్జి మధ్యలో 245/17 కి.మీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండ రాముడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుంది. షేడెడ్ మెరూన్ కలర్ రౌండ్ నెక్, నలుపు రంగు నిలువు, అడ్డ గీతలు గల టీషర్టు ధరించాడు. టీ షర్ట్ అడ్డం నలుపు రంగు గీతపైన అర్బన్ వైబ్స్ అనే అక్షరాలు అక్షరాలు ఉన్నాయి. గ్రే కలర్ లోయర్ ధరించాడు. సుమారు 5.6 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంటాడు. కుడి చెయ్యి చంకలో నల్లటి పుట్టుమచ్చ ఉన్నాయి. ఆచూకీ తెలిసినవారు 9441970940 నబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కర్నూలు ఆర్‌పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు కోరారు.

ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ప్రారంభం



ప్రత్యేక ఫాతెహాలు నిర్వహిస్తున్న మత పెద్దలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో దర్గా

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఆదివారం రాత్రి కౌతాళంలో ఘనంగా ప్రారంభమైంది. ప్రత్యేక ఫాతేహాల అనంతరం స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలు, పానీయాలతో శుభ్రం చేశారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా హుసేని చిష్తీ, పీఠాధిపతి సయ్యద్ ఖాదర్‌బాషా చిష్తీ, వారి శిష్య బృందంతో ప్రత్యేకంగా తెచ్చిన చద్దర్‌ను స్వామి సమాధిపై ఉంచి పూలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఫాతేహాలు నిర్వహించి నగరావాయించారు. దీంతో ఉరుసు ప్రారంభమైంది. ఉత్సవాలు పది రోజుల పాటు జరుగుతాయని ధర్మకర్త తెలిపారు. వర్షం వచ్చినా భక్తులు ఇబ్బందులు కలుగకుండా దర్గాలో ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేశామన్నారు. గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు దూద్‌బాషా పాల్గొన్నారు.

విద్యుత్ అలంకరణలో దర్గా

ఉరుసును పురస్కరించుకుని దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ ద్వారంతో పాటు 60 అడుగుల మహా గోపురం మజీద్‌కు వెళ్లడానికి నూతనంగా నిర్మించిన ముఖద్వారం వరకు విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు ఉంటుందని ధర్మకర్త తెలిపారు.